# 85. బావా, ఎప్పుడు వచ్చితీవు?

నేను ఆ మధ్య ఒకసారి ఏదో పనిమీద గుంటూరు వెళ్లినప్పుడు మా అక్కగారింట్లో మకాం చేసేను. నేను వెళ్లిన మర్నాడు మారెండో అబ్బాయి ఢిల్లీనుంచి అక్కడికి వచ్చేడు. మా అక్క వాణ్ణి చూడగానే చాలా సంబరపడి కూడా; "అదేమిట్రా, ఉత్తరం పత్తరం లేకుండా ఇలా వచ్చేసేవు?" అని వాణ్ణి పలకరించింది. మావాడు కూడా నవ్వుతాలుకి అన్నట్టుగానే జవాబిచ్చేడు: "అదే, పొరపాటయిపోయిందత్తా. నేను ముందుగా ఉత్తరం రాసి వచ్చుంటే మీరు కాస్త జాగర్త పడే వాళ్లు కదా, సారీ!"

"చాల్లే వెధవ కబుర్లు! నువ్వొస్తున్నావని ఉత్తరం వస్తే మేం జాగర్తపడతామా?" అని మా అక్క వాడి మాటలకి నవ్వుకుంటూనే అంది.

"ముందుగా తెలియ పరచడం అనేది జాగర్త పడడం కోసమే అని అలా అన్నానత్తా" అని మా వాడు తను వేసిన ప్రాక్టికల్ జోకు పేలిందికదా అని వాడు కూడా నవ్వేడు.

"ఏమ్టి; పెద్దంతరమ్ చిన్నంతరమ్ లేకుండా అట్లా మాట్లాట్టమ్?" అని నేను ఎన్టీఆర్-గారిదని చెప్పబడే ఒక డైలాగు ఎరువు తెచ్చుకుని మా వాణ్ణి కూకలేశాను.

('ఎన్టీఆర్-గారిదని చెప్పబడే డైలాగు' అని ఎందుకన్నానంటే - అది ఎమ్వీయల్ చెప్పేరుగాని నేను స్వయంగా విన్నది కాదు. "వేటగాడు" అనే సినిమా రిలీజయిన కొన్నాళ్ల తరవాత ఎన్టీఆర్ గారు ఏదో సభలో (బహుశా ఆసినిమా నూరు రోజుల పండగ సభలోనే ) పాల్గొన్న సందర్భంగా ఒక అభిమాని ఆయనతో నాలుగు క్షణాల ఏకాంతం సాధించి "వేటగాడు లో మీ యాక్షన్ బ్రహ్మాండం సార్" అన్నాడట. దానికి వారు చిరాకు పడి; "ఏమ్టి, పెద్దంతరమ్ చిన్నంతరమ్ లేకుండా అట్లా మాట్లాట్టమ్? వేట"గాడు" ఏమ్టి; వేట "గారు" అన్లేవా?" అన్నారని కథ)

బంధువులు గానీ స్నేహితులు గానీ ఎవరింటి కయినా ముందుగా చెప్పిమరీ రానక్కర్లేదనే ఎక్కువమంది నమ్ముతారు. "నేను ఫలానా తేదీని సుమారుగా ఫలానా ఇన్ని గంటల వేళప్పుడు మీవూరు వస్తున్నాను. మీయింట్లోనే దిగి ఫలానా ఇన్నిరోజులు ఉంటాను" అని ఉత్తరం రాసి మరీ వెళ్తే అవతలి వాళ్లు ఏదో జాగర్త పడిపోయి విలువైన వొస్తువులూ డాక్యుమెంట్లూ బేంకులాకర్లలో పెట్టేసుకుని జాగర్త పడిపోరు. ఒచ్చేవాళ్లకే సదుపాయంగా వుంటుంది. కొందరు మరీ మర్యాదస్తులైన గృహస్థులయితే "ఈ మాత్రం దానికి ఉత్తరం రాసి మరీ రావాలిటోయ్? మా ఇంటి తలుపులు నీకోసం ఎప్పుడూ తెరిచే వుంటాయ్" అని ఎదురు సన్నాహం లెటరు కూడా రాస్తారు.

"ఉత్తరం పత్తరం లేకుండా ఇలా వూడిపడ్డావేమిటి" అని పలకరించడంలో అప్యాయతే ఉంటుంది గాని వార్నింగివ్వలేదన్న చిరాకు వుండదు. "ఏమిటో; ఈ వూళ్లో జనరల్ హాస్పిటలూ, హైకోర్టూ, సెక్రెటేరియటూ ఇలాంటివన్నీ ఉండడం వల్ల కాబోలు రోజువిడిచి రోజు ఎవరో ఒకరు వొస్తూనే ఉంటారనుకో!" లాంటి రిసెప్షను కూడా అరుదే.

ముందుగా చెప్పడం అనేది జ్యోతిశ్శాస్త్ర పండితులకి ఒక సరదా. ఈ ఏడాది బాగా వర్షాలు పడతాయనీ, రాజపూజ్యం ఆరూ అవమానం రెండూ అనీ ; పంచాంగకర్తలు రాస్తారు.

ఫలానా ఫలానా నక్షత్రాల్లో పుట్టినవాళ్లు ఫలానా ఫలానా రకం పనులకి ఫలానా ఫలానా తిథుల్నే ఎంచుకోవాలి; లేకపోతే చికాకుల్లో పడిపోతారు- అని వార్నింగులు ఇస్తారు. ఆ విధంగా రాసి వున్నవి ఆవిధంగా జరిగితే మాత్రం పంచాంగంలో ముందే చెప్పేరు కదా- అని ఆనందిస్తారు తప్ప, జరక్కపోతే ఎందుకు జరగలేదని పంచాంగకర్తల్ని ఎవరూ రొకాయించరు. కనీసం వచ్చే యాడాదినుంచీ పంచాంగాలు కొనడం మానేద్దామని నిర్ణయాలు కూడా తీసుకోరు. "నుదుటన్ వ్రాసిన వ్రాత మారదు కదా, నూ రేండ్లు చింతించినన్" అనీ; "రాకన్ మానవు హానివృద్ధులు మహారణ్యంబునన్ దాగినన్" అనీ, "ఏదెలా జరగవలసి వుందో అది అలాగే జరుగుతుంది" అనీ; "అంతా కర్మ!" అనీ ఎవరి ఎడ్యుకేషన్ని బట్టి వారు కాంప్రమైజు అయిపోడం మన సంస్కృతిలో ఒక ముఖ్యమైన విశేషం.

ఇప్పుడంటే శాటిలైట్లూ అవీ వొచ్చి వాతావరణ సూచనలు కొంచెం గురికి బారెడు దూరంలో చెయ్యగలుగుతున్నారు గానీ, వెనకటి రోజుల్లో అయితే "రేపు వాతావరణం ప్రశాంతంగా ఉంటుం"దని చెప్పినప్పుడు అందరూ గొడుగులు పట్టుకు బయల్దేరే వారనీ, "రేపు భారీ వర్షం" అని చెప్తే గొడుగులు ఇళ్లలోనే వదిలేసి పల్చటి బట్టలు కట్టుకువెళ్లేవారనీ జోకులూ కార్టూన్లూ వచ్చేవి.

నేను హైదరాబాదులో పనిచేస్తూ వుండిన రోజుల్లో ఓసారి నా ఫ్రెండు కృష్ణమూర్తికి వాళ్ల ఫ్రెండు నరిసింమూర్తి నుంచి ఓ ఉత్తరం వచ్చింది. తను ఏదో కోర్టు పనిమీద వస్తున్నట్టూ, వీళ్లింట్లోనే మకాం చేసేటట్టూ అందులో సమాచారం. కృష్ణమూర్తి వెంటనే జవాబు రాసేడు. "స్వాగతం. నువ్వు వచ్చే రైలు ఇక్కడికి తెల్లారగట్ట అయిదింటికే చేరుతుంది కనక స్టేషనుకైతే రాలేనుగానీ, నువ్వు మా ఇంట్లో వుండడానికి వీలుగా ఏర్పాట్లు చేస్తున్నాను. మా ఇంటికి దారి వివరాలూ బస్సు నెంబర్లూ ఇస్తున్నాను. నువ్వు ఎలాగా పళాసా నుంచే వస్తున్నావు కనక, ఓ కేజీ జీడిపప్పు కట్టించి పట్టుకు రా. మీ అన్నయ్యని అడిగేనని చెప్పు - "

అనుకున్ననాడు నరిసింమూర్తి రాలేదు. అతన్ని అడ్వకేటు దగ్గిరికీ కోర్టుకీ తీసికెళ్లడానికని సెలవు పెట్టిన కృష్ణమూర్తి ఆ ఉదయం పది గంటల దాకా చూసి ఆఫీసుకి వెళిపోయాడు.

ఆ మూడోరోజు సాయంకాలం నేనూ కృష్ణమూర్తీ అతనింట్లో కబుర్లు చెప్పుకుంటూ కూర్చుని వుండగా నరిసింమూర్తి ఆ ఇల్లు వెతుక్కుంటూ వచ్చేడు. "నే నొస్తున్నానని రాసిన ఉత్తరానికి నీ దగ్గిర్నుంచి సమాధానం లేకపోయేసరికి హోటల్లో రూమ్ తీసుకుని ఈ మూడు రోజులూ ఉన్నాను; నీకేదైనా ఇబ్బందో, కేంపో అనుకుని-" అంటూ ఎపాలజీస్ చెప్పేడు. కొంతసేపు పోయేక "మా ఇల్లు చూద్దువు గాని, రా!" అని కృష్ణమూర్తి అతన్ని లోపలికి తీసికెళ్లినప్పుడు, అతను అక్కడ వదిలిన చేతిసంచిలో కృష్ణమూర్తి దస్తూరీతో ఉన్నపోస్టుకార్డు లీలగా కనిపిస్తే ఇవతలికి లాగి ఓసారి చూసేసి మళ్లీ దాన్ని (మరింత జాగ్రత్తగా) లోపల పెట్టేశాను.

"పళాసా జీడిపప్పు కేజీ రెండు వందల యాభై రూపాయలుంది. ఏదైనా సంసార పక్షపు హోటల్లో సింగిల్ రూమ్ అద్దె రోజుకి నలభైలో సాధ్యమే." అని నాకు తట్టింది గాని, అలాటివి చెప్పేసి స్నేహితులిద్దరి మధ్యనీ పచ్చగడ్డి వెయ్యడం, అది ఒక వేళ భగ్గుమంటే చూడ్డం నా సరదాలు కావు. ★